క్లుప్తంగా

కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన



ఆపరేషన్లకు ఎంపికైన వారితో కుప్పం పీఈఎస్ వైద్య సిబ్బంది

బైరెడ్డిపల్లి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం మహతీ ఫౌండేషన్ సహకారంతో కుప్పం పీఈఎస్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో 34 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఆరుగురిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. ఎంపికైన వారికి ఉచితంగా అన్ని సదుపాయాలు కల్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఫౌండేషన్ నిర్వాహకులు, పీఈఎస్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటేరుపాళ్యంలో పారిశుధ్య లోపం



ఓటేరుపాళ్యం వీధిలో ప్రవహిస్తున్న మురుగునీరు

బైరెడ్డిపల్లి: మండలంలోని నెల్లిపట్ల పంచాయతీ పరిధిలోని ఓటేరుపాళ్యంలో పారిశుధ్యం లోపించడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గత నెలలో గ్రామానికి చెందిన విద్యార్థి డెంగీ జ్వరంతో మృతిచెందినా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. మురుగు కాలువలు శుభ్రం చేయకపోవడంతో కలుషితనీరు వీధుల గుండా ప్రవహిస్తూ దుర్వాసన వెదజల్లుతోందని, విషజ్వరాలు విజృంభిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దివ్యాంగులకు వీల్‌చైర్లు పంపిణీ

రొంపిచెర్ల: దివ్యాంగులకు ప్రభుత్వం మంజూరు చేసిన వీల్‌చైర్లు, వినికిడి యంత్రాలు, చంక కర్రలను(క్రచ్చెస్) టీడీపీ నేత చల్లా రామచంద్రారెడ్డి ఆదివారం పంపిణీ చేశారు. మండల దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు ఇర్షాద్ మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇచ్చి ఉచితంగా ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. వివాహాలు చేసుకునే దివ్యాంగులకు రూ.1.50 లక్షల ఆర్థిక సాయం మంజూరు చేయాలన్నారు. అలాగే ప్రభుత్వం సబ్సిడీ రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. దివ్యాంగుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి దాది శ్రీను, సర్పంచ్ ఇబ్రహీంఖాన్, సంఘ నేతలు మహ్మదాలి, అబ్దుల్ రెహమాన్, దిలీప్, వాసు, బావాజాన్, వార్డు మెంబరు లక్ష్మయ్య పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ కృష్ణకాంత్

పుత్తూరు: వైద్యాధికారులు, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సంఘం కృషి చేస్తోందని ఆరోగ్య విస్తరణాధికారులు, సామాజిక ఆరోగ్య అధికారుల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.శివయ్య తెలిపారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో సంఘం ఏర్పాటు చేసిన 2025 క్యాలెండర్‌ను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణకాంత్ చేతులమీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా అధ్యక్షుడు ఎం.నరసింహప్రసాద్, నాయకులు ఎస్.వేణుగోపాల్, డీఎస్ వెంకటేశులు, కె.రమేష్‌బాబు, పి.రవిచంద్రరాజు, అన్నాదొరై, వేణుగోపాల్ పాల్గొన్నారు.

కౌన్ బనేగా ఏఎంసీ చైర్మన్..?

- ఏఎంసీ బీసీ మహిళలకు రిజర్వేషన్ ఖరారు
- దీనిపై ఇప్పటికే జనసేన, బీజేపీ నాయకుల చూపు
- టీడీపీలోని బీసీ నాయకుల ప్రయత్నాలు
- సంక్రాంతికి కొత్త చైర్మన్



పలమనేరు ఏఎంసీ కార్యాలయం

పలమనేరు: నియోజకవర్గంలో ఎమ్మెల్యే తర్వాత ప్రొటోకాల్ ఉన్న పోస్టు మార్కెట్ కమిటీ చైర్మన్. ఏఎంసీ చైర్మన్‌కు అన్ని మండలాల్లో ప్రభుత్వ కార్యక్రమాలు, పార్టీ వ్యవహారాల్లో సముచిత స్థానం ఉంటుంది. దీంతో కూటమి అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలోని పలు మండలాల నాయకుల కన్ను ఏఎంసీ చైర్మన్ కుర్చీపై పడింది. తాజాగా జిల్లాలోని పది మార్కెట్ కమిటీలకు ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేసింది. పలమనేరు ఏఎంసీ సీటును బీసీ మహిళలకు కేటాయించారు. సంక్రాంతి లోపు కొత్త చైర్మన్లు కొలువుదీరే అవకాశం ఉంటోందని ప్రస్తుత పరిస్థితుల బట్టి తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కూటమిలోని జనసేన, బీజేపీకి చెందిన ఆశావహులు ఓ వైపు చైర్మన్ పోస్టు కోసం ప్రయత్నాలు మొదలు పెట్టినట్టు తెలిసింది. మరోవైపు ఎన్నో ఏళ్లుగా టీడీపీని అంటిపెట్టుకుని ఉన్న ఆ పార్టీ సీనియర్ బీసీ నాయకులు సైతం దీనిపై ఆశలు పెట్టుకున్నారు. దీనికి పోటీ ఎక్కువ కావడంతో స్థానిక ఎమ్మెల్యే ఎవరికి అవకాశం ఇస్తారనే విషయం ఇప్పుడు నియోజకవర్గంలో హాట్ టాపిక్‌గా మారింది.

చైర్మన్ గిరికి ఇంత డిమాండ్ ఎందుకంటే..

పలమనేరు సమీపంలోని క్యాటిల్ ఫామ్ వద్ద 33 ఎకరాల స్థలంలో ఇంటిగ్రేటెడ్ టమాట మార్కెట్‌ను రూ.55 కోట్లతో నిర్మించనున్నారు. ఇది జిల్లాలోనే మోడల్ మార్కెట్‌గా చేయాలని మార్కెటింగ్ అధికారులు ఆలోచన. హైవేకు ఆనుకుని వాణిజ్య సముదాయాలను నిర్మించనున్నారు. మార్కెట్‌కు వచ్చిన కూరగాయలకు అక్కడికక్కడే ప్యాకింగ్, గ్రేడింగ్ యూనిట్లను ఏర్పాటు చేయనున్నారు. రైతుల సౌకర్యార్థం క్యాంటీన్లు, రైతు విశ్రాంతి గదుల నిర్మాణాలు ఉంటాయి. దీనికి సమీపంలోనే పశువులు, గొర్రెల వారపుసంతలుంటాయి. ఇలాంటి మోడల్ మార్కెట్ రూ.33 కోట్లతో పనులు జరుగనున్న నేపథ్యంలో చైర్మన్ గిరికి డిమాండ్ బాగా పెరిగినట్టు సమాచారం.

భారీగా బీసీ ఆశావహులు

కూటమిలోని జనసేన, బీజేపీ మాటేమిటోగానీ ఇక్కడ టీడీపీని అంటిపెంటుకున్న కులాల్లో బీసీలు ఎక్కువగా ఉన్నారు. వీరిలో కురబ కులానికి చెందిన ఓటర్లు 20వేల వరకూ ఉన్నారు. మిగిలిన బీసీ కులాల్లో వాల్మీకి, వడ్డెర, పల్లెగొండర్ల ఓట్లు ఎక్కువగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో చైర్మన్ గిరి కోసం పట్టణానికి చెందిన ఇద్దరు సీనియర్ నేతలు, వి.కోటకు చెందిన మరో ఇద్దరు, గంగవరానికి చెందిన మాజీ జెడ్పీటీసీ సతీమణుల పేర్లు వినిపిస్తున్నాయి. అయితే బైరెడ్డిపల్లెకు చెందిన కీలకనేత సతీమణికి ఇప్పటికే ఖరారైనట్లు ఆ మండలంలో టాక్. ఏఎంసీ చైర్మన్‌ను ఇప్పటికే ఖరారు చేసుకుని ఆపై రిజర్వేషన్లు సెట్ చేశారని ఆ పార్టీలోనే చర్చ నడుస్తోంది. ఏదేమైనా ఏఎంసీ చైర్మన్ విషయంలో పార్టీ కోసం కష్టపడిన బీసీలకు గుర్తింపు ఇవ్వాలని ఇప్పటికే పలువురు బీసీ నేతలు స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన నేపథ్యంలో ఎవరికి ఈ పదవి దక్కుతుందోనన్నది ఆసక్తికరంగా మారింది.

పార్టీ మారితే పదవులకు రాజీనామా చేయాలి



సలీంబాషా, రాష్ట్ర కార్యదర్శి

రొంపిచెర్ల: పార్టీలు మారిన వైఎస్సార్‌సీపీ నేతలు పదవులు, సభ్యత్వానికి రాజీనామా చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సలీంబాషా డిమాండ్ చేశారు. ఆదివారం రొంపిచెర్లలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఒక పార్టీలో గెలిచి మరో పార్టీలో కొనసాగడం అనైతికమన్నారు. పార్టీ మారిన నాయకులు పదవుల్లో కొనసాగే అర్హత లేదన్నారు. తల్లిలాంటి పార్టీకి వెన్నుపోటు పొడిచిన నాయకులకు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్న కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీలో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదన్నారు. కార్యకర్తలకు ఎలాంటి కష్టాలు వచ్చినా తాము అండగా ఉంటామని ఆయన భరోసా కల్పించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గాలికి వదిలేసిందని ఆరోపించారు.

పురస్కారం అందుకున్న ఎంపీడీఓ బాలాజీ



పురస్కారం అందుకుంటున్న బాలాజీ

పలమనేరు: పట్టణానికి చెందిన ప్రముఖ రచయిత, పెద్దపంజాణి ఎంపీడీఓ పలమనేరు బాలాజీకి బీసీ సంఘర్షణ సమితి బహుజన సామాజిక రచయిత పురస్కారాన్ని ప్రదానం చేసింది. ఆదివారం తిరుపతి ఎస్వీయూ సెనేట్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఓఆర్‌ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు, వీసీ సీహెచ్ అప్పారావుల చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. వారు మాట్లాడుతూ ఆదివాసీ ఎరుకల జీవితాలపై ఆయన రాసిన ఏకలవ్య కాలనీ ఎరుకుల జీవితాల్లోని ఉద్వేగాలను కళ్లకు కనిపించేలా చూపిందన్నారు. నిర్వాహకులు లక్ష్మయ్య, సాకం ప్రభాకర్, ఉమ్మడి జిల్లాలకు చెందిన పలువురు కవులు, రచయితలు పాల్గొన్నారు.

మలేషియాలో చౌడేపల్లె డాక్టర్‌కు సత్కారం



డాక్టర్ మురళీధర్‌ను సత్కరిస్తున్న మలేషియా ప్రతినిధులు

చౌడేపల్లె: మలేషియా దేశంలోని కౌలాలంపూర్‌లో తెలుగు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో భాగంగా చిత్తూరు జిల్లా చౌడేపల్లె డాక్టర్ మురళీధర్, రైతు శ్రీరామగోపాల్‌కు ఘన సత్కారం లభించింది. వీరిని మలేషియా ఆంధ్రా అసోసియేషన్ సభ్యులు అభినందించారు. బయోలిక్కర్ అధినేత డాక్టర్ అమరనాథ్, పేదలకు ఉచిత వైద్యసేవలందిస్తూ సమాజ సేవలో కృషిచేస్తున్న దాత డాక్టర్ మురళీధర్‌ను సత్కరించి అభినందించారు. కార్యక్రమానికి మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, మలేషియా ఇండియన్ హైకమిషన్ చాన్స్‌లర్ అమృతదాస్, మలేషియా ఆంధ్రా అసోషియేషన్ అధ్యక్షుడు బోలిశెట్టి శ్రీరామ్, ఉపాధ్యక్షుడు శ్రీరామ్ జగదీష్, హిమబిందు పాల్గొన్నారు.



నీరు వృథా.. రైతుల వ్యథ

మండలంలోని నడిగడ్డ పంచాయతీ పరిధిలోని రఘుపతినాయుని చెరువు నుంచి నీరు వృథాగా పోతుండడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు గార్గేయనది నుంచి కాలువల ద్వారా చెరువుకు నీరు చేరి నిండింది. దీంతో ఆయకట్టులో పంటల సాగుకు రైతులు సిద్ధమయ్యారు. కానీ తూము వద్ద రంధ్రం పడి నీరంతా వృథాగా పోతోంది. -సదుం

హైమాస్ లైట్లు ప్రారంభం



లైట్లను ప్రారంభిస్తున్న నాగరాజు

వి.కోట: పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలో ఆదివారం నూతనంగా ఏర్పాటు చేసిన హైమాస్ లైట్లను ప్రారంభించారు. వి.కోట మేజర్ పంచాయతీ సర్పంచ్ పీఎస్.లక్ష్మి చొరవతో ఏర్పాటు చేసిన ఈ హైమాస్ లైట్లను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు ప్రారంభించారు. వార్డు మెంబర్ కుమార్‌రాజా, నేతలు రామచంద్రుడు, క్రిష్ణ, అధికారులు పాల్గొన్నారు.

సూచిక బోర్డు ఏర్పాటు చేయాలి



సూచిక బోర్డు ఏర్పాటు చేయాల్సిన కూడలి

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేట గ్రామంలో నాలుగురోడ్ల కూడలిలో సూచిక బోర్డు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు. పలమనేరు నుంచి రాయలపేట మీదుగా నిత్యం వందలాది వాహనాల్లో ప్రయాణికులు బోయకొండ గంగమ్మను దర్శించుకునేందుకు వెళుతుంటారు. తిరుగు ప్రయాణంలో రాయలపేట గ్రామంలో ఎల్ ఆకారంలో పలమనేరుకు వెళ్లే మలుపు రోడ్డు ఉండడంతో పాటు హెచ్చరిక బోర్డు లేకపోవడంతో వాహనదారులు నేరుగా పెనుగొలకల రోడ్డులోకి వెళ్లి ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సూచిక బోర్డు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సన్మానం



నాగరాజును సన్మానిస్తున్న నిర్వాహకులు

పలమనేరు: పలమనేరు ఏరియా ఆస్పత్రి నూతన సలహామండలి సభ్యుడు నాగరాజును పట్టణానికి చెందిన ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ సంఘ నిర్వాహకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. తాము ప్రథమ చికిత్సను మాత్రమే నిర్వహించి రోగులను ప్రభుత్వాస్పత్రులకు పంపుతున్నామని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందుతోందని, తాము రోగులకు అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. వాసు, అన్నపూర్ణ, రజనీ, జగదీష్, అరుణ, ప్రసన్న, రిహానా పాల్గొన్నారు.

కడపనత్తం విద్యార్థినుల ప్రతిభ



ఎంపికైన విద్యార్థినులతో హెచ్‌ఎం

బైరెడ్డిపల్లి: అండర్-17 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బాలికల క్రికెట్ విభాగంలో మండలంలోని కడపనత్తం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు హెచ్‌ఎం నందగోపాల్‌రెడ్డి, పీడీ చిరంజీవి తెలిపారు. పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఎం.చరిత, కె.కవిత గతనెల పుత్తూరు క్రీడామైదానంలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపడంతో మీడియం ఫేస్ బౌలర్లుగా ఎంపికైనట్లు చెప్పారు. ఈనెల 6,7,8 తేదీల్లో మంగళగిరిలో జరగనున్న రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థినులను ఉపాధ్యాయ బృందం, కమిటీ సభ్యులు అభినందించారు.

7న చిత్తూరులో ఉద్యోగమేళా

చిత్తూరు కలెక్టరేట్: నగరంలో కొంగారెడ్డిపల్లెలోని తమ కళాశాలలో ఈనెల 7న ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు విజ్ఞాన సుధ డిగ్రీ కళాశాల చైర్మన్ శ్రీధర్ కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ మేళాలో హైదరాబాద్, చెన్నైకు చెందిన పేరొందిన కంపెనీల ప్రతినిధులు అభ్యర్థులను ఎంపిక చేసుకుంటారని, గత విద్యా సంవత్సరంలో పాసైన డిగ్రీ, ఇంజినీరింగ్, విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పరిశీలనలు సరే.. సౌకర్యాలేవీ?

- ఆర్టీసీ బస్టాండును పరిశీలించిన డీపీటీఓ జగదీష్
- మాటలేనా, చేతలు లేవా అని పశ్నించిన ప్రయాణికులు



బస్టాండ్‌ను పరిశీలిస్తున్న ఆర్టీసీ అధికారులు

వి.కోట: పత్రికల్లో వార్తలు వచ్చినప్పుడు మాత్రం ఆర్టీసీ అధికారులు వస్తారు, బస్టాండును చూస్తారు, అదిగో సీసీ రోడ్డు, ఇదిగో మరుగుదొడ్లు అంటూ చెపుతారు, పోతారు. తర్వాత చేసేది ఏమీ లేదు. ఇప్పటికైనా ఆర్టీసీ బస్టాండును బాగుచేస్తారా సారూ, లేదా పరిశీలనలతోనే సరిపెట్టుకుంటారా అని ఆర్టీసీ అధికారులను ఆదివారం ప్రయాణికులు ప్రశ్నించారు. ఆదివారం వి.కోట ఆర్టీసీ బస్టాండును చిత్తూరు జిల్లా డీపీటీఓ జగదీష్ అధికారులతో కలసి పరిశీలించారు. ఈసందర్భంగా పరిశీలిస్తున్న అధికారులను చూసి ప్రయాణికులు అధికారుల వద్దకు వచ్చి ప్రశ్నల వర్షం కురిపించారు. వారు మాట్లాడుతూ అనతికాలంలో ఏర్పాటుచేసిన వి.కోట బస్టాండుతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, బస్టాండు ఆవరణ మొత్తం కంకర్లు తేలి గుంతలమయమైందన్నారు. దీంతో వర్షం వస్తే నీటి కుంటలను తలపిస్తూ బస్టాండు మొత్తం బురదకుంటలుగా మారుతున్నాయన్నారు. అంతేకాక తాగు నీరు, మరుగుదొడ్లు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎన్నిసార్లు తెలిపినా అధికారులు స్పందించలేదని ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

జెల్లి ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా ఆందోళన



ఆందోళనకు సిద్ధమవుతున్న స్థానికులు

కుప్పంరూరల్: మండలంలోని ఆవులనత్తం వద్ద సాగుతున్న జెల్లీ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా స్థానికులు ఆదివారం ఆందోళన చేశారు. ఇది వరకే ఫ్యాక్టరీ ప్రారంభంలో స్థానికులు కార్యకలాపాల వల్ల అధిక శబ్దం, పంట పొలాలపై దుమ్ము చేరి తద్వారా ఆరోగ్యాలు పాడవుతాయని స్థానికులు రోడ్డెక్కి కొన్ని రోజుల పాటు జెల్లీ ఫ్యాక్టరీని మూయించారు. ఫ్యాక్టరీ యాజమాన్యం స్థానికులతో మాట్లాడి మళ్లీ ప్రారంభించారు. తాజాగా ఆదివారం మరోమారు ఫ్యాక్టరీ చుట్టు పక్కల ఉన్న జనం పంట పొలాలు పాడవుతున్నాయని, అధిక శబ్దాలతో ఉండలేకపోతున్నామని ఆందోళన చేశారు. దీనిపై ఫ్యాక్టరీ యజమాని వివరణ కోరగా, తమకు ప్రభుత్వం నుంచి అన్ని రకాల అనుమతులు ఉన్నాయని, ఆందోళన చేస్తే చట్టప్రకారం వెళ్తామని అన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

పలమనేరు: రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘ 2025 సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం స్థానిక బాలికోన్నత పాఠశాలలో ఆదివారం జరిగింది. ఈసందర్భంగా సంఘ నేతలు గురురాజారావు మాట్లాడుతూ నూతన డైరీలో పెన్షనర్లకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు, రూల్స్, ఇంకా ఎన్నో సమస్యలకు పరిష్కారంగా ఉంటాయన్నారు.

ఉద్యోగుల హామీలు నెరవేర్చాలి

రొంపిచెర్ల: ఉద్యోగులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని పుంగనూరు నియోజకవర్గ నోబుల్ టీచర్ల యూనియన్ ఇన్‌చార్జి హరిప్రసాద్ అన్నారు. ఆదివారం రొంపిచెర్లలో స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యలను కుటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన కూటమి నేతలు ఇప్పుడు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇంతవరకు పీఆర్సీ కమిటీ వేయలేదని, మూడు డీఏలను విడుదల చేయలేదని మండిపడ్డారు. నెలలో మొదటి తేదీనే జీతాలు ఇస్తామని అయిదో తేదీ వచ్చినా ఇంతవరకు ఖాతాల్లో జమ చేయలేదని ప్రశ్నించారు. కుటుంబ అవసరాలకు తీసుకున్న ఈఎంఐలు ఎలా చెల్లించాలని ఆవేదన వ్యక్తం చేశారు.

క్రీడలతోనే మానసికోల్లాసం



క్రికెట్ ఆడుతున్న ఎంసీ విజయానందరెడ్డి

శ్రీరంగరాజపురం: మానసికోల్లాసం కోసం యువతకు క్రీడలు ఎంతో అవసరమని వైఎస్ఆర్ సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త ఎంసీ విజయానందరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కొత్తపల్లె పంచాయతీ 49 కొత్తపల్లిమిట్టలో క్రికెట్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్‌ను ఆర్గనైజర్లు భువనేష్, యువరాజ్, తేజు ప్రసాద్, గిరిచౌదరి, లలిత్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయానందరెడ్డి టోర్నమెంట్‌ను ప్రారంభించి, క్రీడాకారులతో ఆయన సరదాగా ఆడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు క్రీడాభివృద్ధికి ఎక్కువ నిధులను మంజూరు చేసి గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించిందని తెలిపారు. గ్రామీణ క్రీడాకారులు జాతీయ క్రీడాకారులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ డీవీ.డిల్లయ్య, నాయకులు విజయబాబు, కోటిరెడ్డిబాబు, దేవరాజులురెడ్డి, యుగంధర్, సుధాకర్ పలువురు నాయకులు పాల్గొన్నారు.



చౌడేపల్లె నుంచి తిరుమలకు బయలుదేరిన భక్తులు



రామకుప్పం: కాలినడకన తిరుమలకు వెళుతున్న భక్తులు

తిరుమలకు పాదయాత్ర

చౌడేపల్లె: గోవింద మాలధారణ ధరించిన భక్తులు చౌడేపల్లె నుంచి ఆదివారం తిరుమలకు పాదయాత్రగా బయలుదేరారు. ఎస్.అగ్రహారానికి చెందిన గురుస్వామి, ఆనందాచార్యుల ఆధ్వర్యంలో మండల నుంచి వంద మంది భక్తులు పాదయాత్రగా కలిసి వెళ్లారు. చౌడేపల్లె నుంచి 130 కిలోమీటర్లను మూడు రోజుల పాటు పాదయాత్ర చేసి తిరుమలకు చేరుకొని స్వామి వారిని దర్శించుకోనున్నట్లు పేర్కొన్నారు.

కాలినడకన తిరుమలకు..

రామకుప్పం: మండలంలోని కొర్నాలకొండ తండా, టేకుమాను తండా, రామకుప్పంకు చెందిన గోవిందమాల భక్తులు ఆదివారం ఉదయం కాలినడకన తిరుమలకు బయలుదేరారు. స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి కాలినడకను ప్రారంభించారు. వైకుంఠ ఏకాదశి రోజున స్వామి వారిని దర్శించుకోవడం ఆనవాయితీగా ఉందని భక్తులు తెలిపారు. గత 15 సంవత్సరాలుగా 41 రోజులు గోవిందమాల ధరించి స్వామివారి దర్శనానికి కాలినడకన వెళ్తున్నట్లు తెలిపారు. కోదండనాయక్ స్వామి, రవినాయక్‌స్వామి, రామిరెడ్డి స్వామి, నాగరాజు స్వామి పాల్గొన్నారు.